



సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు


బతకలేక 'ప్రైవేట్' పంతుళ్లు

- జీతం మూరెడు... చాకిరీ బారెడు
- అరకొరగా వేతనాల చెల్లింపు
- ప్రవేశాల కోసం వీధుల్లోకి పంపుతున్న యాజమాన్యాలు
- పుస్తకాలు మోసే పనీ వారి పైనే...

ఒకప్పుడు బతకలేక బడి పంతులు అనే వారు. ఇప్పుడా నానుడి ప్రయివేట్ స్కూళ్ల ఉపాధ్యాయులకు సరిగ్గా అతికినట్లు సరిపోతుంది. రోజంతా పనిచేసినా పట్టుమని రూ.పది వేల జీతం కూడా కొన్ని యాజమాన్యాలు చేతికి ఇవ్వడం లేదు. విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తూ గల్లా పెట్టెలు నింపుకుంటున్న యాజమాన్యాలు ఉపాధ్యాయులకు మాత్రం కన్నీళ్లనే మిగులుస్తున్నాయి. పాఠశాలల్లో ప్రవేశాల పెంపునకు వీరినే ఉపయోగించుకుంటున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రతి టీచర్‌కు లక్ష్యాన్ని నిర్దేశిస్తున్నాయి. అలా చేరుకోని వారిని తర్వాత సంవత్సరంలో నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నాయి. ప్రయివేట్ స్కూళ్లలో అరకొర వేతనాలు, శ్రమ దోపిడీ సాగుతున్నా విద్యాశాఖ మౌనం పాటిస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా విద్యాశాఖ లెక్కల ప్రకారం ప్రయివేట్, అన్ ఎయిడెడ్ స్కూళ్లు కలిపి మొత్తం 398 ఉన్నాయి. వీటిలో సుమారు ఎనిమిది వేల మందికి పైగా పనిచేస్తున్నట్లు ఒక అంచనా. ఇందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు చెల్లించే జీతాలు ప్రయివేట్ యాజమాన్యాల దయాదాక్షిణ్యంపై ఆధారపడి ఉంది. అర్హత, సీనియార్టీ ప్రాతిపదికన జీతాలు చెల్లిస్తున్నాయి. శ్రీకాకుళం నగరంలోని పలు కార్పొరేట్ యాజమాన్యాలు తమ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రూ.పది వేల నుంచి రూ.15 వేల వరకు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. అనుభవం ఉంటే మరో రూ.మూడు వేల వరకు ఇస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న స్కూళ్లే గరిష్ఠంగా రూ.20 వేలు చెల్లిస్తుండడంతో, తామేం తక్కువ తినలేదన్నట్లు బాగా నడుస్తున్న ప్రయివేట్ స్కూళ్లు సైతం రూ.15 వేలకు మించి చెల్లించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఉపాధ్యాయులకు కనీసం రూ.ఐదు వేలు కూడా ఇవ్వడం లేదు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, ఆమదాలవలస ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వేతనం కనీసం రూ.10 వేలు కూడా దాటడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల చేరికలు తక్కువగా ఉండడం, వారి నుంచి వసూలు చేసే ఫీజులు తక్కువగా ఉండడంతో వేతనాలు పెద్దగా చెల్లించలేకపోతున్నామని యజమాన్యాలు చెప్పినా అర్థం ఉంది. ఎల్‌కెజి విద్యార్థి నుంచి రూ.15 వేలకు తక్కువ కాకుండా వసూలు చేస్తున్న శ్రీకాకుళం నగరంలోని కార్పొరేట్, ప్రయివేట్ స్కూళ్లు ఎందుకు కనీస వేతనం చెల్లించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



పిల్లలను చేర్పిస్తేనే ఉద్యోగం

ఉపాధ్యాయులకు ప్రయివేట్ యాజమాన్యాలు రకరకాల పనులు అప్పగిస్తున్నాయి. వేసవి సెలవుల్లో కొన్ని స్కూళ్లు డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించాయి. ప్రతి ఇంటికీ వెళ్లి చదువుతున్న పిల్లల వివరాలను సేకరించే పనిని చూడాలని పురమాయించాయి. కొన్ని స్కూళ్లు టీచర్లతోనే పుస్తకాల విక్రయాలు చేపడుతున్నాయి. కొన్ని స్కూళ్లలో టీచర్లకు కనీసం పది అడ్మిషన్లు, పిల్లల పేరెంట్స్‌కు సంబంధించి 20 చిరునామాలు తీసుకురావాలంటూ లక్ష్యంగా నిర్దేశించాయి. మీకు తెలిసిన పిల్లలు ఉంటే కొంచెం చెప్పరూ అంటూ పలు స్కూళ్ల టీచర్లు అర్థించడం వారి దయనీయ స్థితికి అద్దం పడుతోంది. కార్పొరేట్ స్కూళ్లు మరీ దారుణంగా వ్యవహరిస్తున్నాయి. ఒక సంవత్సరంలో వారు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోకుంటే, ఆ తర్వాత సంవత్సరంలో వారిని ఇంటికి సాగనంపుతున్నారు.

ఉద్యోగం దినదిన గండమే

ప్రయివేట్ స్కూల్‌లో ఉద్యోగం దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్న చందంగా ఉంటుంది. టీచర్‌కు కోపమొచ్చినా, యాజమాన్యానికి ఆగ్రహం వచ్చినా పోయేది ఉపాధ్యాయుడి ఉద్యోగమే. ఉపాధ్యాయుల్లో బతుకుదెరువు కోసం పనిచేస్తున్న వారే అత్యధిక మంది ఉన్నారు. భర్త తెచ్చిన జీతం చాలక ఇతర అవసరాలు గట్టెక్కుతాయనే ఉద్దేశంతో ఎక్కువ మంది మహిళలు పనిచేస్తున్నారు. స్కూల్‌లో ఏ పేరెంట్ ఫిర్యాదు చేసినా, ఆ రోజు ఆ టీచర్‌కు చివాట్లు తప్పవు. స్కూల్‌కు ఆలస్యంగా వచ్చినందుకు ఒక రోజు జీతం మినహాయిస్తున్నారు. యాజమాన్యం అప్పగించిన పనిని తూచ తప్పకుండా చేసిన వారు మాత్రమే ఆ స్కూల్‌లో ఉపాధ్యాయులుగా కొనసాగే పరిస్థితి దాదాపు అన్ని స్కూళ్లలోనూ ఉంది. శ్రీకాకుళం నగరంలోని పేరు మోసిన ఒక ప్రయివేటు పాఠశాలలో కూలీలను పెట్టకుండా, జూనియర్ టీచర్లతో వ్యాన్లతో వచ్చిన పుస్తకాలను దింపించి, మోయించారంటే ఎంతటి దయనీయ పరిస్థితో అర్థం చేసుకోవచ్చు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ఉపాధ్యాయులను ప్రయివేట్ యాజమాన్యాలు శ్రమదోపిడీ చేస్తున్నా, అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామంటూ యథాలాపంగా అధికారులు చెప్తున్నారు. పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి, ఏం జరుగుతుందో చూసే నాథుడే కరువయ్యాడు. దీంతో ప్రయివేట్ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపడితే ప్రయివేట్ ఉపాధ్యాయులకు అండగా నిలిచినవారవుతారు.

త్వరలో విద్యుత్ పోరుబాట

- విద్యుత్ ఛార్జీలపై జగన్ నమ్మకద్రోహం
- మోడీతో జత కట్టి విద్యుత్ రంగం సర్వనాశనం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - పలాస

విద్యుత్ ఛార్జీల పెంపుదలను నిరసిస్తూ పాదయాత్రలు, ఇతర రూపాల్లో విద్యుత్ పోరుబాట తప్పదని పలు పార్టీల నాయకులు స్పష్టం చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై కాశీబుగ్గలోని ఒక లాడ్జిలో సిపిఐ నాయకులు చాపర వెంకటరమణ అధ్యక్షతన మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచబోమని హామీనిచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నమ్మకద్రోహం చేశారని విమర్శించారు. కేంద్రంలోని బిజెపితో జత కట్టి విద్యుత్ రంగాన్ని పూర్తిగా సర్వనాశనం చేస్తోందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని సంస్కరణల పేరుతో అదానీ, ఇతర కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సంస్కరణలను రాష్ట్రంలో జగన్ అమలు చేస్తూ వినియోగదారుల జేబులు ఖాళీ చేస్తున్నారని విమర్శించారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలతో పేద, మధ్యతరగతి ప్రజల జీవనం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. భూ పత్రాలు, విద్యార్థుల స్కూలు బ్యాగులు, పుస్తకాలపై తన బొమ్మలు ముద్రించుకుంటున్న జగన్, కరెంటు బిల్లులపై తన బొమ్మలు వేసుకునే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు.

సర్దుబాటు ఛార్జీల విధానమే ప్రమాదకరమని, దీన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారాయన్నారు. స్మార్ట్‌మీటర్ల కొనుగోలులో రూ.వేల కోట్ల అవినీతి చోటుచేసుకుందని విమర్శించారు. ప్రమాదకరమైన విద్యుత్ సంస్కరణలపై రాజీ లేని పోరు సాగించాలని పిలుపునిచ్చారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. విద్యుత్ భారాలపై సాగే ఐక్య ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, సిపిఐ నాయకులు చాపర సుందరలాల్, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు టి.సన్యాసిరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, వైద్యులు దువ్వాడ జీవితేశ్వరరావు, జనసేన నాయకులు సంతోష్ పండా, ఎన్‌జిఒ నాయకులు బి.గోపాల్, పలు పార్టీల నాయకులు చాపర వేణుగోపాల్, లండ వెంకటరావు, ఎన్.గణపతి, నెయ్యిల గణపతి, కుత్తుం దుష్యంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యాన నిర్వహించే యోగా దినోత్సవంలో నగరంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు, వైద్యారోగ్యశాఖ, పారామెడికల్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు పాల్గొనున్నట్లు చెప్పారు. యోగా శిక్షణా కేంద్రాలు ఇందులో పాల్గొని యోగా వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరిస్తూ యోగాసనాలు వేయించనున్నారని చెప్పారు. ఈ ఏడాది వసుధైక కుటుంబం నినాదంతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

1 నుంచి ఓటర్ల జాబితా వెరిఫికేషన్

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

శ్రీకాకుళం : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జులై ఒకటో తేదీ నుంచి ఓటర్ల జాబితా వెరిఫికేషన్ చేయనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై ఒకటో తేదీ నుంచి బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల జాబితాను తనిఖీ చేస్తారని తెలిపారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ పరిశీలనలో అధికారులు పక్షపాతంతో వ్యవహరించి అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా వెరిఫికేషన్ ప్రక్రియలో వాలంటీర్లను వినియోగించవద్దని తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ పి.మురళీకృష్ణ, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, వైసిపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శిమ్మ రాజశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు పెండింగ్ దరఖాస్తుల పరిశీలన

- బిఎల్‌ఒలకు శిక్షణా తరగతులు
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇఆర్‌ఒ, ఎఇఆర్‌ఒలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఒకే డోర్ నంబరుపై పది కంటే ఎక్కువగా ఓటర్లు నమోదై ఉంటే, అటువంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వందేళ్లు నిండిన ఎలక్ట్రోలర్స్‌పై రీ వెరిఫికేషన్ చేయాలని చెప్పారు. బిఎల్‌ఒలు డోర్ టు డోర్ సర్వే చేయాలని, యువ ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలన్నారు. సచివాలయ పరిధిలో డేటా అందుబాటులో ఉందన్నారు. మేజర్ పంచాయతీల్లో పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని చెప్పారు.

గతంలో ఓటరు నమోదు విధుల్లో నిర్వహించిన అనుభవం ఉన్న వారే కావడం వల్ల మరింత మెరుగ్గా విధులు నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళీకృష్ణ, ఆర్‌డిఒలు బి.శాంతి, సీతారామ్మూర్తి, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

8న ఎర్రన్న విద్యా సంకల్పం పరీక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

నిరుద్యోగులకు ఎర్రన్న విద్యా సంకల్పం పేరిట పుస్తక సాయం చేయనున్నట్లు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తెలిపారు. ఇందుకోసం ఈనెల 26వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని చెప్పారు. విద్యార్థుల ఆలోచనాశక్తిని పెంపొందించడం కోసం ఎర్రన్న విద్యా సంకల్పం పరీక్షను జులై ఎనిమిదో తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షకు ఉత్తరాంధ్ర నుంచి 4,800 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. జిల్లావ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఊతమిచ్చే ఈ పోటీ పరీక్షల్లో డిఎస్‌సి, పోలీసు శాఖ, గ్రూప్-1, 2 పోస్టులకు అవసరమయ్యే ప్రామాణిక పుస్తకాలు, మెటీరియల్‌ను అందించి నిరుద్యోగులను ఉద్యోగులుగా మార్చేందుకు ఈ కార్యక్రమం ఎంతో సహాయపడుతుందన్నారు.

ఎంపీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా విద్యలకు నిలయం కావాలన్నదే తన తండ్రి ఎర్రన్నాయుడు చిరకాల వాంఛ అని అన్నారు. ఆయన ఆశయసాధన కోసం ఎర్రన్న విద్యాసంకల్పం పేరిట ఒక పరీక్ష నిర్వహించి నిరుపేద, నిరుద్యోగ యువతకు తమవంతు సహాయం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 90305 55251, 98474 35842 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ను నాగార్జున ప్రతాప్, టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు చౌదరి నారాయణమూర్తి, జిల్లా అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమ ప్రభుత్వం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలోని సింగుపురంలో రూ.26.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి ధర్మాన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో వ్యవసాయం దండగ అని రైతులను కించపరుస్తూ ఆర్థికంగా వారిని దెబ్బ తీశారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులకు అండగా నిలిచామన్నారు. విత్తనం నుంచి విక్రయం వరకు రైతుభరోసా కేంద్రాల ద్వారానే చేపడుతున్నట్లు చెప్పారు. ధాన్యం కొన్న 21 రోజుల్లోపు చెల్లింపులు చేసినట్లు తెలిపారు. టిడిపి ప్రభుత్వంలో విత్తనాలు, ఎరువులు కావాలంటే జన్మభూమి కమిటీల వద్దకు వెళ్లి అడగాల్సి వచ్చేదని, ఇప్పుడు రైతుభరోసా కేంద్రంలోనే తీసుకునే వీలు కల్పించామన్నారు. రూ.200 కోట్ల వ్యయంతో గొట్టాబ్యారేజీ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్నామని, ఇది పూర్తయితే మండు వేసవిలోనూ నీరందుతుందన్నారు. రైతులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపిపిలు అంబటి నిర్మల, గొండు రఘురాం, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, ఎఎంసి చైర్మన్ మూకళ్ల తాతబాబు, వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, సర్పంచ్ గుండ ఆదిత్య నాయుడు, ఎంపిటిసిలు బగ్గు అప్పారావు, నక్క శంకర్, మాజీ సర్పంచ్ గుండ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలను అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ఆరోగ్యమిత్రలకు ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్యమిత్రలు వైద్య అవసరాల కోసం వచ్చే పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సూచించారు. జిల్లాలో ఆరోగ్యమిత్రలుగా మంచి సేవలు అందించిన ఇద్దరికి కలెక్టర్ తన ఛాంబర్‌లో ప్రశంసాపత్రాలు, రూ.ఐదు వేల నగదు చెక్కులను మంగళవారం అందజేశారు. శ్రీకాకుళంలో ఆరోగ్యమిత్రగా పనిచేస్తున్న దబ్బక చిట్టిబాబు, నీలంచెట్టి రమణమ్మను సిఇఒ హెల్త్ కేర్ ట్రస్టు ఉత్తమ సేవా మిత్రలుగా గుర్తించిన నేపథ్యంలో వారిద్దరిని అభినందించారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ కె.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పలరాజు ప్రోద్బలంతోనే దిమ్మ తొలగింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

మంత్రి సీదిరి అప్పలరాజు ప్రోద్బలంతోనే మందస మండలం బాలిగాంలో టిడిపి జెండా దిమ్మను డిఎస్‌పి సమక్షంలో తొలగించారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆరోపించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 30 ఏళ్లకు పైగా అక్కడ ఉన్న జెండా దిమ్మను తొలగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. మంత్రి అప్పలరాజు నాలుగేళ్లకే మిడిసిపడుతున్నారని విమర్శించారు. జెండా దిమ్మను తొలగించారన్న విషయం తెలిసి అక్కడకు వెళ్లిన మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీపై డిఎస్‌పి బాలచంద్రారెడ్డి వ్యవహరించిన తీరు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన శివాజీపై ఇలాగే వ్యవహరిస్తారా అని ధ్వజమెత్తారు. మంత్రి అప్పలరాజు ఆదేశాలను పాటిస్తూ తప్పుడు కేసులు బనాయించారని విమర్శించారు. ఇటీవల పదో తరగతి విద్యార్థిపై పెట్రోలు పోసి తగలబెడితే స్పందించని పోలీసులు, శివాజీ విషయంలో మాత్రం దూకుడుగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలవుతుందా?, రాజారెడ్డి రాజ్యాంగం అమలవుతుందో పోలీసులు సమాధానం చెప్పాలన్నారు. పలాస నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో టిడిపి జెండా ఎగురవేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపును ఎవరూ ఆపలేరని చెప్పారు. టిడిపి జెండా దిమ్మను ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేసి పోలీసులు చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు కొర్ను నాగార్జున ప్రతాప్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ మీనాక్షి

మాదక ద్రవ్యాల వాడకాన్ని ప్రజలకు దూరం చేయాలన్న లక్ష్యంతో ప్రతిఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. మాదకద్రవ్యాల వినియోగం నియంత్రణపై జిల్లాలో డ్రగ్ డిఅడిక్షన్ సర్వీసులు అందిస్తున్న కౌన్సిలర్లకు నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యారోగ్య, వికలాంగ శాఖల ఆధ్వర్యాన మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వికలాంగుల శాఖ ఎడి కె.కవిత, అదనపు డిఎంహెచ్‌ఒ ఎన్.అనురాధ, మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్, మాస్టర్ ట్రైనర్ సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



మూతపడిన జీడి పరిశ్రమలు

జీడి పరిశ్రమల బంద్ విజయవంతం

ప్రజాశక్తి - పలాస

తనిఖీల పేరిట పోలీసుల వేధింపులను నిరసిస్తూ మంగళవారం చేపట్టిన ఒక్క రోజు జీడి పరిశ్రమల బంద్ విజయవంతమైంది. నియోజకవర్గంలోని పలాస, కాశీబుగ్గ, ఇంగిలిగాం పారిశ్రామికవాడ, మందస, హరిపురం, వజ్రపుకొత్తూరులోని మొత్తం 350 జీడి పరిశ్రమలు బంద్‌తో మూతపడ్డాయి. 700 మంది వ్యాపారులు బంద్‌లో భాగస్వామ్యమయ్యారు. బంద్‌తో 3,500 బస్తాల జీడిపిక్కల ప్రాసెసింగ్ నిలిచిపోయింది. జీడి పరిశ్రమల బంద్‌తో పారిశ్రామికవాడ బోసిపోయింది. ఈ సందర్భంగా పలాస జీడి పరిశ్రమల సంఘం అధ్యక్షులు మల్లా సురేష్, ఇండస్ట్రియల్ ఏరియా జీడి పరిశ్రమల సంఘం అధ్యక్షులు మల్లా రామేశ్వరరావు మాట్లాడుతూ మందస మండలం చిన్నబరంపురానికి చెందిన స్వేచ్ఛావతి కాష్యూ కంపెనీ యజమాని కిల్లంశెట్టి కిషోర్ 69 డబ్బాల జీడి పప్పును వారణాసికి వ్యానులో పంపిస్తుండగా తనిఖీల పేరిట కాశీబుగ్గ పోలీసులు ఈనెల 17న ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు.

కొన్ని పత్రాలు సరిగ్గా లేవని చెప్తూ వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారని తెలిపారు. జిఎస్‌టి అధికారులు బిల్లులు సక్రమంగా ఉన్నాయని చెప్పినా పోలీసులు విడిచిపెట్టలేదన్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ బంద్‌కు పిలుపునివ్వడంతో 19న జీడిపప్పును వ్యాపారికి అందించారని చెప్పారు. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా, పోలీసులు వ్యాపారులను నిందితులుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సక్రమంగా వ్యాపారం చేస్తున్నా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బంద్‌కు సహకరించిన వ్యాపారులు, కార్మికులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లోనూ వ్యాపారులకు నష్టం, ఇబ్బందులు కలిగించే చర్యలపై ఇదే సంఘీభావ స్ఫూర్తిని ప్రదర్శించాలని వ్యాపారులు నిర్ణయించారు.


మాట్లాడుతున్న మురళీధరరావు

మూఢ నమ్మకాలకు స్వస్తి చెప్పాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతూ, అంతరిక్షంలో ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటున్న ప్రస్తుత మానవుడు మతమౌఢ్యంతో, మూఢ నమ్మకాలతో అనాగరికంగా వ్యవహరిస్తున్నారని, దీనిని నుంచి బయటపడాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంటి మురళీధరరావు అన్నారు. జనవిజ్ఞాన వేదికలో సభ్యులు చేరి శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు. మండలంలోని కొత్తపేట పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నుంచి ఉద్దేశించి మంగళవారం మాట్లాడారు. మానవుడు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగమిస్తూ... ఇంకా చాందసభావాలతో కొంత మంది వ్యవహరిస్తున్నారని అన్నారు. అందులో భాగమే కరోనా కాలంలో లాంతర్లు వెలిగించడం, గంటలు మోగించడం ఒక భాగమే అని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు అన్నారు. దీనిని బయటకు పడి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వి.ఎస్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు టి.ధనలక్ష్మి, పి.ఉష, ఎల్.గోపి, పి.పార్వతి, సుజాత, నీరజ పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న జీడి రైతులు

జీడి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- పలాస

జీడి పిక్కల సీజన్ ముగింపుకు వచ్చి మార్కెట్ చేసుకోవాల్సిన సమయం దాటుతున్నా జీడికి కనీసం మద్దతు ధర లేక రైతులు అమ్ముకోలేక తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిలో ఉన్న రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ డిమాండ్ చేశారు. మండలంలోని మాకన్నపల్లిలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తక్షణమే స్పందించి వ్యాపారస్తులకు, రైతులకు సమన్వయ పరిచి వెంటనే జీడి పిక్కలు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీడి రైతులు తమ పిల్లలు చదువులకు అవసరమైన డబ్బులు కోసం అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే కొనుగోలు చేయకపోతే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో ఖరీఫ్ సీజన్ మొదలవుతున్నందున వ్యవసాయిక పెట్టుబడి నిమిత్తం డబ్బు అవసరం ఉన్నందున వెంటనే జీడి పిక్కలను వ్యాపారులు కొనేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, మహిళా సంఘం నాయకురాలు కుత్తుం హేమావతి, కుత్తుం జానకమ్మ మల్లెన ఇందిరమ్మ, గేదెల సీత, రైతు కూలీ సంఘం నాయకులు గోరకల బాలకృష్ణ పాల్గొన్నారు.

నిరుపయోగంగా 'పుర' కళ్యాణ మండపం

ప్రారంభించి నాలుగేళ్లయినా అలాగే..

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో నిర్మించిన వైఎస్ఆర్ కళ్యాణ మండపం పూర్తి చేసి అత్యంత అట్టహాసంగా ప్రారంభించారు. ప్రారంభించి నాలుగేళ్ల పూర్తవుతున్నా... నేటికీ వినియోగంలో లేక నిరుపయోగంగా పడి ఉంది. మున్సిపాలిటీలో ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని, తద్వారా మున్సిపాలిటీకి ఆదాయ వనరుగా రెవెన్యూ వస్తుందని కౌన్సిల్ సభ్యులు ఆలోచించారు. అప్పటి మున్సిపల్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి పాలకవర్గంలో 2007 జనవరి 26న మున్సిపల్ కళ్యాణ మండపానికి శ్రీకారం చుట్టారు. అప్పటి మంత్రి రెడ్యానాయక్, ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాల్ ఆధ్వర్యాన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఐడిఎస్ పథకం కింద నిధులు కేటాయిస్తూ మొదటి విడతగా రూ.37 లక్షలతో పనులు చేపట్టినా, అనివార్య కారణాలతో అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఆ తర్వాత పాలకవర్గంలో అడుగుపెట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి హయాంలో రూ.72 లక్షల వరకు నిధులు కేటాయించారు. అయినా ఇంకా పుర్తిస్థాయి పనులు కాకుండానే పాలకవర్గం గడువు పూర్తవుతుందనే ఉద్దేశంతో 2019 జూన్ 29న అప్పటి ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ చేతుల మీదుగా వైఎస్ఆర్ కళ్యాణ మండపాన్ని లాంఛనంగా ప్రారంభిం చారు. ఆ తర్వాత మళ్లీ మున్సిపాలిటీ ఎన్నికలు రావడం, రెండోసారి చైర్‌పర్సన్‌గా పిలక రాజ్యలక్ష్మి పదవి బాధ్యతలు స్వీకరించారు. అయినా మున్సిపల్ కళ్యాణ మండపానికి మోక్షం రాలేదు. ఇప్పటికీ కళ్యాణ మండపం వినియోగంలోకి తీసుకురావాలన్న ఆలోచన పెట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు పాలకవర్గంలో కొనసాగుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి ప్రత్యేక దృష్టి సారించకపోవడంపై పట్టణ ప్రజలు, నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నెల 29 వస్తే కళ్యాణ మంటపం ప్రారంభించి నాలుగేళ్ల పూర్తవుతుంది. ప్రతి కౌన్సిల్ సమావేశం లోనూ సభ్యులు వైఎస్ఆర్ కళ్యాణ మంటపం వినియోగంలో తేవాలని అభ్యర్థిస్తున్నారు. అయినా వినియోగంలోకి తేవడం లేదు. మున్సిపాలిటీ పరిధిలో శుభ కార్యక్రమాలు, సమావేశాలు పెట్టుకోవడానికి రూ.లక్షలు వెచ్చించి ప్రయివేటు కళ్యాణ మండపాల్లో నిర్వహించుకుంటున్నారు. పురకు ఉన్న ఏకైక కళ్యాణ మండపం వినియోగంలో వస్తే ప్రజలకు తక్కువ అద్దెకు వినియోగించే అవకాశం ఉంది. దీంతోపాటు మున్సిపాలిటీ అభివృద్ధికి ఆర్థికంగా ఉపయోగపడే వనరుగా లాభిస్తుంది. సువిశాల స్థలంలో ట్రాఫిక్‌కి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అన్ని తరగతులకు ఉపయోగకరంగా ఉండే మున్సిపల్ కళ్యాణ మండపం వినియోగం లోకి తేస్తే బాగుంటుందని పట్టణ వాసులు అంటున్నారు. ఇప్పటికైనా పాలకవర్గం మున్సిపల్ కళ్యాణ మండపం వినియోగంలో తెచ్చేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.


నిరుపయోగంగా ఉన్న వైఎస్ఆర్ కళ్యాణ మండపం

బోరుభద్రలో అక్రమ లేఅవుట్!

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని బోరుభద్రలో అక్రమలేవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా లేవుట్లు వెలుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంది. బోరుభద్రలో సర్వే నంబరు 126-2,3,4లో ఎకరా 56 సెంట్లలో అనుమతి లేకుండా లేఅవుట్ వేసి విక్రయిస్తున్నారు. పంచాయతీ, రెవెన్యూ, సుడా అధికారుల అనుమతి లేకుండా ఇష్టానుసారంగా రియల్టర్లు వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం లేఅవుట్ వేసే ముందు వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు అధికారుల ద్వారా అనుమతి తీసుకోవాలి. ఆనంతరం ప్లాట్లు వేసేందుకు ప్లానింగ్ అధికారులు అనుమతులు పొందాలి. వారు లేఅవుట్ వేసిన భూములను పరిశీలించి, అనుమతులు ఇస్తారు. అలాగే సామాజిక అవసరాల నిమిత్తం 10 శాతం భూమిని పంచాయతీకి కేటాయించాల్సి ఉంది. కొలతలు ప్రకారం రోడ్లు డ్రైనేజీ ఏర్పాటు చేయాలి. అయితే స్థానికంగా అటు వంటివి ఏమీ కనిపించడం లేదు. రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం విలువ ప్రకారం 14 శాతం స్టాంప్ డ్యూట్ చలానా తీసి, పంచాయతీకు అందజేయాలి. ఇక్కడ అలాంటిది ఏమి చేయకుండా లక్షల రూపాయిలు పంచాయతీ ఆదాయానికి గండికొట్టారు. రెవెన్యూ, పంచాయతీ, సుడా అధికారుల అనుమతి లేకుండా వేసిన లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై విఆర్ఒ నాగరాజును వివరణ కోరగా, లేఅవుట్‌కు సంబంధించిన కన్వర్షన్ దరఖాస్తు ఏమి రాలేరని అన్నారు. పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరాగా, లేఅవుట్‌కు సంబందించిన ఎటువంటి పర్మిషన్ తీసుకోలేదని, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన లే అవుట్‌లో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తామని అన్నారు. సుడా అధికారి పి.వెంకటేష్‌ను వివరణ అడుగగా, సుడా నుంచి ఎటువంటి అనుమతులు లేవు అని అన్నారు.


బోరుభద్రలో వేసిన లేవుట్

సమస్యల పరిష్కారానికి ఉద్యమం

రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- లావేరు

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి అంత ఐకమత్యంగా ఉద్యమిస్తామని రేషన్ డీలర్లు సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి రవికుమార్ పిలుపునిచ్చారు. లావేరులో లావేరు, రణస్థలం మండలాలకు చెందిన రేషన్ డీలర్ల సమావేశం మంగళవారం నిర్వహించారు. ముందుగా డీలర్లు మండల పౌరసరఫరాల గోదాం వద్దకు ర్యాలీ వెళ్లి అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్నాళ్లుగా తాము పడుతున్న సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జులై నెలకు సంబంధించిన రేషన్ సరుకులకు గోదాం వద్ద కచ్చితంగా తూకం వేయకపోతే తాము మూకుమ్మడిగా సరకులు తీసుకెళ్లమని స్పష్టం చేశారు. వచ్చే నెల 23న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి డీలర్లు సమావేశానికి డీలర్లందరూ పాల్గొవాలని కోరారు. కార్యక్రమంలో లావేరు, రణస్థలం మండలాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు లంక అబ్బినాయుడు, పుల్లపు వెంకటరావు, ప్రధాన కార్యదర్శి ముప్పడి రమేష్, బి.హరికృష్ణ, వేణుము వీర్రాజు, మంగరాజ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవికుమార్

రైలు కింద పడి యువకుడు మృతి


సింహాచలం (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో మంగళవారం తెల్లవారు జామున రైలు కింద పడి సరియాపల్లికి చెందిన చల్ల సింహాచలం (27) మృతి చెందాడు. సింహాచలం నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేసేవాడు. గ్రామానికి దగ్గరగా ఉంటుందనే ఉద్దేశంతో ఏడాది క్రితం విశాఖ జిల్లా అనకాపల్లిలోని ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. అయితే రెండు నెలలు క్రితం ఇంటికి వచ్చి వెళ్లిన తరువాత మంగళవారం తెల్లవారు జామున హరిశ్చంద్రపురం రైలు నిలయం సమీపంలో రైలు పట్టాల మధ్య విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న జిఆర్‌పి హెచ్‌సి రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ఫ్యాంట్‌లోని పర్సులోని ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. కుటుంబ సభ్యులు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని పలాస రైల్వే ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి తండ్రి నారాయణరావు రెండేళ్ల క్రితం మృతిచెందగా, తల్లి చిన్నమ్మడు, తమ్ముడు లోకేష్‌లు ఉన్నారు. సింహాచలం మృతితో సరియాపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. జిఆర్‌పి హెచ్‌సి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్ : మండలంలోని అక్కవరం జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వీరి వాహనాన్ని వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఒడిశాకు చెందిన వ్యాన్ డ్రైవర్ ఫజిలీ నాథ్, క్లీనర్ షేక్ రాజ్జకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ ఎల్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఫిర్యాదు చేస్తున్న రాజు

జనసేన స్థూపం ధ్వంసంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని గొర్లపాడు పంచాయతీ రాపాకపుట్టుగ, సవసానపుట్టుగ గ్రామాల పరిధిలో హైవేకు ఆనుకుని మంగళవారం సంత వద్ద ఉన్న జనసేన స్థూపాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, జెండా పోల్‌ను ఎత్తుకెళ్లారని, బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు కోరారు. ఈ మేరకు కవిటి ఎస్ఐ రాముకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పిరికిపందల్లా స్థూపాలు ధ్వంసం చేయడం, పోస్టర్లు చింపడం మానేసి ప్రజాసేవకు కృషి చేయాలని అన్నారు. ఇకపై మళ్లీ ఇలాంటివి జరిగితే తీవ్రమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఘటనను పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తూ, ఈ దుచ్చర్యకు పాల్పడిన దుండగులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తిప్పన దుర్యోధనరెడ్డి, మత్స్య వికాస విభాగ రాష్ట్ర కార్యదర్శి నాగుల హరి బెహరా, రోకళ్ల భాస్కర్, అంగ సురేష్, హేమా చలపతి, రాజశేఖర్, తలగాన ఈశ్వర్, వల్లభరావు, జోగారావు, రామకృష్ణ, ప్రవీణ్ బెహరా, గిరి బెహరా, నవీన్, ధనుంజయం పాల్గొన్నారు.

సమీకృత వ్యాపారంపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న షాజి

కవిటి: మండలంలో ఉత్పత్తవుతున్న మత్స్య సంపదతో అపార అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా మత్స్యకారులు సమీకృత వ్యాపార విధానంతో మంచి లాభాలు పొందవచ్చుని ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్ఆర్ఎల్ఎం ఎన్ఆర్‌పి ఎం.షాజి అన్నారు. సెర్ప్, వెలుగు ఆధ్వర్యాన మండలంలోని కపాసుకుద్దిలో మత్స్యకారులతో ఎన్ఆర్ఎల్ఎమ్ టీం మంగళవారం సమావేశమైంది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మండలంలోని తీర ప్రాంతంలో లభిస్తున్న మత్స్య సంపదతో సుమారు 20కి పైగా ఉత్పత్తులు తయారు చేసి ఎగుమతులు చేసేందుకు అవకాశం ఉందన్నారు. దీనికోసం మత్స్యకారులు ఒక యూనిట్‌గా ఏర్పడితే ఎన్ఆర్ఎల్ఎం ద్వారా ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ముఖ్యంగా ఇక్కడ లభిస్తున్న ఎండు చేపలు ఎగుమతి చేయడం, నాణ్యమైన పచ్చడి తయారు చేయడం, కొన్ని రకాల మందుల తయారీలో చేపలను వినియోగిస్తున్నారని, వారికి మన ద్వారా చేపలు ఎగుమతి చేయడం ద్వారా మెరుగైన ఆదాయాలు పొందవచ్చుని తెలిపారు. యూనిట్‌గా ఏర్పడిన మత్స్యకారులకు ఎన్ఆర్ఎల్ఎం ద్వారా ఆర్థిక సాయం అందించడమే కాకుండా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిపిఎం ఎల్‌హెచ్ బి.నారాయణరావు, సెర్ప్ ప్రతినిధి జె.శ్రీనివాసరావు, మత్స్యకార ఎఫ్‌పిఒ అధ్యక్షుడు కాయ భీమసేన్ పాల్గొన్నారు.

పైపులైన్ మరమ్మతు పనులు వేగవంతం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పురపాలక సంఘంలో పైపులైన్ మరమ్మతులు పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధికారులకు అదేశించారు. మండలంలోని బాహుదా నది వద్ద సమీపంలో గ్రానైట్ రాయిని తరలించిన పనుల్లో దెబ్బతిన్న వాటర్ మెయిన్ పైప్‌లైన్ మరమ్మతు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటిని సరఫరాను చేయాలని ఆదేశించారు. ఈమె వెంట ఇన్‌ఛార్జి ఎఇ పృథ్వీ, కౌన్సిలర్లు మధుమూర్తి, నీలాపు లక్ష్మి, ఆదిరెడ్డి, తేజేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యులు సాలీన ఢిల్లీ, లోకేష్, ప్రకాష్‌పట్నాయక్‌లు ఉన్నారు.


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రాజ్యలక్ష్మి

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.3 లక్షలతో 13వ వార్డు బెల్లుపడ తిప్పన కూర్మారావు ఇంటి నుంచి గుజ్జు తిరుపతి ఇంటి వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులకు రాజ్యలక్ష్మి శంకుస్థాపన చేశారు. రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.

న్యాయవాది మృతికి సంతాపం

టెక్కలి : టెక్కలి బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తూ... గుండెపోటుతో మృతి చెందిన న్యాయవాది బొడ్డేపల్లి మన్మథరావు మృతిపై జూనియర్ సివిల్ జడ్జి మళ్ల చక్రవర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద ఒక ప్రకటనలో సంతాపాన్ని వ్యక్తం చేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, సీనియర్ న్యాయవాదులు ఖజానా వెంకటరావు, దవళ రాజేశ్వరరావు, బాబూరావు, వైకుంఠరావు పాణిగ్రాహి, బాబూరావు, సాయిరాజ్, భుజంగరావు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు


కంది విత్తనాలను పంపిణీ చేస్తున్న సురేష్

జలుమూరు: కౌలు రైతులందరూ పంట సాగుదారు హక్కు పత్రం పొందడం ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న రైతు సంక్షేమ పథకాలు అందుతాయని మండల ఎఒ కె.సురేష్ అన్నారు. మండలంలోని రాణ, చిన్నదూగాం, లింగాలవలస గ్రామాల్లో మంగళవారం కౌలు రైతుల గుర్తింపు గ్రామ సభలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతులకు ఇవ్వనున్న గుర్తింపు పత్రంపై భూయజమానులు ఎటువంటి అపోహలకు గురికావద్దన్నారు. కేవలం 11 నెలల కాలపరిమితి వరకు మాత్రమే కార్డు వినియోగంలో ఉంటుందన్నారు. అనంతరం వంద శాతం రాయితీతో కంది విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు బుక్క లక్ష్మణరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


మహిళకు పోస్టర్‌ను అందజేస్తున్న స్పీకర్ సీతారాం

'గడప గడప'తో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

గడపగడపతోనే సమస్యలు పరిష్కారమవుతాయని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కనుగులవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నది? లేనిదీ? లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను శత శాతం నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కిందని అన్నారు. గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి నాంది పలికారని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, గ్రామ సచివాలయాల కో-ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్ బాబు, బొడ్డేపల్లి నారాయణ రావు, పొన్నాడ కృష్ణ, గురుగుబెల్లి నీలారావు, ప్రభాకరరావు, ఎన్ని రామచంద్రరావు, చిగురుపల్లి దశరథ, మండల ఎఒ మెట్ట మోహనరావు, ఎపిఎం పైడి కూర్మారావు, ఎపిఒ సురవరపు లక్ష్మీనరసమ్మ, విద్యుత్‌శాఖ ఎఇ రవికుమార్ పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని తామాడ పంచాయతీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఎం జగన్ అమలు చేస్తున్న నవరాత్నాలు పథకంలో భాగంగా సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.లక్ష వరకు లబ్ధి చేకూరుతుందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టర్లను అందజేశారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, మాజీ ఎంపిపి డి.రాజినాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనివాసరావు, వైఎస్ ఎంపిపి లుకలాపు శ్రీనివాసరావు, ఎంపిడిఒ కె.సురేష్, ఎంఇఒ లండ ఈశ్వరరావు, ఎపిఎం మాదవీలత పాల్గొన్నారు.

రెండు నెలల్లో రూ.వంద కోట్ల రుణాలు

డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్

పలాస: జిల్లాలో రెండు నెలల్లో డ్వాక్రా సంఘాలకు రూ.వంద కోట్లు రుణాలు మంజూరు చేశామని డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ తెలిపారు. స్థానిక స్త్రీనిధి భవనంలో సోంపేట క్లస్టర్ పరిధిలో పలాస, వజ్రపుకొత్తూరు, సోంపేట, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి మండలాల వెలుగు అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 49,022 డ్వాక్రా సంఘాలు ఉన్నాయని అన్నారు. అందులో ఎ-గ్రేడ్‌లో 23,960, బి-గ్రేడ్ లో 18320, సి-గ్రేడ్‌లో 6,352 సంఘాలు ఉన్నాయని చెప్పారు. అయితే ఎ-గ్రేడ్‌కు రూ. 20 లక్షలు, స్త్రీ నిధి రూ.5 లక్షలు, బి-గ్రేడ్‌కు రూ.15 లక్షలు, స్త్రీ నిధి రూ.3 లక్షలు, సి-గ్రేడ్‌కు రూ.7 లక్షలు చొప్పున రుణాలు మంజూరు చేశామన్నారు. జిల్లాలో స్త్రీ నిధి రూ.167 కోట్లు లక్ష్యం కాగా, రెండు నెలల్లో 5,124 డ్వాక్రా సభ్యులకు రూ.33 కోట్లు రుణాలు మంజూరు చేశామని అన్నారు. ప్రతినెలా డ్వాక్రా సంఘాలతో సమావేశంలో తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. సంఘాలతో సమావేశం నిర్వహించడంలో నిర్లక్ష్యం వస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సిసిలు, సిఎఫ్‌లు విఒ పరిధిలో సమావేశాలు నిర్వహిస్తున్నరా? లేదా? పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎపిఎంలపై ఉందన్నారు. డ్వాక్రా సంఘాలకు ఇచ్చిన రుణాలను తిరిగి బ్యాంకులకు సకాలంలో చెల్లించే విధంగా మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు, ఏరియా కో-ఆర్డినేటర్ మోహనరావు, స్త్రీ నిధి జిల్లా ఎజిఎం వి.సత్యనారాయణ, ఉన్నతి జిల్లా డిపిఎం శ్రీధర్, ఐటి డిపిఎం కళ్యాణ్ చక్రవర్తి, స్త్రీ నిధి జిల్లా మేనేజర్ కె.రాము, ఎంఎంఎస్ మండల అధ్యక్షులు రాజేశ్వరి, కోశాధికారి వరలక్ష్మి, ఎపిఎంలు మల్లేశ్వరరావు, జాంబవతీ, రవణమ్మ, గోవింద, ఉమాదేవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీడీ విద్యాసాగర్


పోస్టర్‌ను అందజేస్తున్న టిడిపి నాయకులు

బాబుతోనే 'భవిష్యత్‌కు గ్యారంటీ'

వజ్రపుకొత్తూరు : వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, చంద్రబాబుతోనే మన భవిష్యత్‌కు గ్యారంటీ లభిస్తుందని మాజీ ఎంపీపీ జి.వసంత స్వామి, గోవిందపురం పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. టిడిపి మహానాడులో ప్రకటించిన భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం పాతటెక్కలి పంచాయతీ లింగాలపాడులో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు. టిడిపి మినీ మేనిఫెస్టోకి ప్రజల నుంచి విశేష స్పందన కనిపిస్తుంన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి కర్ని రమణ, పిరియా శివప్రసాద్, బాలక గిరి, కె.అప్పారావు, ఎం.పాపారావు, సైన బాలాజీ, ఎం.జోగారావు, అఖిల్, మోహనరావు, దానేసు, తుంబనాథం పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారాలు

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బైపిసిలో 982 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో అత్యధిక మార్కులు సంపాదించిన కోర్లాపు మీనాకుమారికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం పురస్కారాన్ని అందుకున్నారు. ఈ మేరకు విజయవాడలోని బెంజి సర్కిల్ వద్ద నున్న ఒక పంక్షన్ హల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మీనా కుమారికి ఈ అవార్డును అందజేశారు. రూ.లక్ష నగదుతో పాటు బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. దీంతో మీనాకుమారికి కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, గ్రామస్తులు మోదుగువలస గణపతిరావు, మోదుగువలస దుర్యోధనరావు, బి.అప్పలస్వామి అభినందనలు తెలిపారు.

బూర్జ : మండలంలోని ఓ.వి.పేట ఎపి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ చదివిన కెంబూరు లహరికి సిఎం జగన్ సన్మానించారు. లహరి ఇంటర్ బైపిసి గ్రూపులో 981 మార్కులు సాధించింది. దీంతో విజయవాడలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో లహరికి గోల్డ్ మెడల్, రూ.లక్ష నగదు, ధ్రువపత్రం అందజేశారు. అలాగే ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావుకూ మెమోంటో అందజేశారు. అలాగే నియోజకవర్గంలో ప్రథమ స్థానం పొందినందుకు రూ.15 వేలు, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందినందుకు రూ.5 వేలు విద్యార్థికి బహుకరించారు.

సోంపేట : సోంపేట ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థిని ఆట్ల అమృత ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యధికంగా 986 మార్కులు సాధించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జగనన్న ఆణిముత్యాలు పురస్కారం అందుకుంది. రూ.లక్ష నగదుతో పాటు పురస్కారం, జ్ఞాపికను అందుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పురస్కారాన్ని అందజేస్తున్న సిఎం జగన్


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి వనిత

జగన్నాథపురంలో వైద్య శిబిరం

సంతబొమ్మాళి : మండలంలోని జగన్నాథపురంలో సర్పంచ్ జోగి రాములమ్మ అధ్యక్షతన మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ డి.వనిత 150 మంది సుగర్, బిపి రోగులను వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఎండలు తీవ్రత దృష్ట్యా ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో తిరగరాదని సూచించారు. తరచూ మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవాలని సూచించారు. రోగులు క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కె.నరసమ్మ, ఎల్.సంతోషి, వై.నీలవేణి, వై సంతోషి పాల్గొన్నారు.


విత్తనాలను పంపిణీ చేస్తున్న గిరిబాబు

వరి విత్తనాల పంపిణీ

పొందూరు: మండలంలోని రాపాకలో సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు మంగళవారం వరి విత్తనాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందజేస్తున్న విత్తనాలను, ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, విఎఎ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూర్ణానంద స్వామిని అరెస్టు చేయాలి

టెక్కలి : విశాఖపట్నానికి చెందిన రామానంద ఆశ్రమ నిర్వాహకులు పూర్ణానంద స్వామిపై పోక్సో చట్టం నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బోకర నారాయణరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆశ్రమం పేరుతో బాలికలను నిర్బంధించి రాత్రి సమయాల్లో లైగింకంగా వేధింపులకు గురిచేయడమే గాక, బాలిక అదృశ్యంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలన్నారు. తక్షణమ చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంకా ఇటువంటి ఆశ్రమాలపై దాడులు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.


పురస్కారాలు అందుకున్న విద్యార్థినులతో రాంప్రసాద్

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

టెక్కలి : టెక్కలి సమరసతా ఫౌండేషన్ ఆధ్వర్యాన ఈ ఏడాది విద్యా సంవత్సరంలో వివిధ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం పురస్కారాలను అందజేశారు. నీట్ ఫలితాల్లో 720కి 649 మార్కులు సాధించిన తంగుడు శ్రీకీర్తి, సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన అంధవరపు వైష్ణవి, ఐడియల్ జీనియస్‌లో రన్నర్‌గా నిలిచిన ఇప్పిలి ప్రజ్ఞలను ప్రశంసాపత్రంతో పాటు షీల్డ్‌ని సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా సహాయ కన్వీనర్ కోరాడ రాంప్రసాద్ మంగళవారం అందజేశారు. గ్రామీణ ప్రాథమిక వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ సత్తారు రాజశేఖర్ ఢిల్లీలో అవార్డు అందుకోవడంపైనా ఆయనకు సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు పొట్నూరు హరి, దుక్క రమేష్‌రెడ్డి, లాడి శ్రీనివాసరావు, కోరాడ మోహనరావు, తర్లాన నారాయణమూర్తి, బొడ్డ అయ్యబాబు పాల్గొన్నారు.

రోడ్డు పనులు వేగవంతం

పలాస: పలాస కెటి రోడ్డు విస్తరణ, ముత్యాలమ్మ కోనేరు పనులు వేగవంతం చేయాలని మున్సిపాలిటీ ఇఇ సుగుణాకర్ అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు కెటి రోడ్డు, ముత్యాలమ్మ కోనేరు పనులను మంగళవారం పరిశీలించారు. కెటి రోడ్డు విస్తరణ పనులు ఎంతవరకు వచ్చాయి, ఇంకా ఎంత పని చేయాల్సి ఉంది, ఇంకేమైనా ఇబ్బందులు ఉన్నాయా, ముత్యాలమ్మ కోనేరు పనులు ఎంతవరకు వచ్చాయి తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం తనకు అందించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, మున్సిపల్ డిఇ బల్ల హరి, మున్సిపల్ ఎఇఇ అవినాష్ పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న లక్ష్మంనాయుడు

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

ఆమదాలవలస : పూర్తిగా ప్రకృతి సేద్యంలో పంటలను పండించి సమాజానికి మంచి విషతుల్యం లేని ఆహారాన్ని అందించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం శిక్షణ ట్రైనీ అసోసియేట్స్ గోవిందరెడ్డి లక్ష్మంనాయుడు రైతులకు సూచించారు. మండలంలోని చేపేనపేటలో రైతులు నిర్వహిస్తున్న పెస్ట్ సర్వే లైన్ కాంపాక్ట్ బ్లాక్‌ను మంగళవారం పరిశీలించారు. పెస్ట్ సర్వే లైన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న క్షేత్రాల జియో కో-ఆర్డినేట్స్‌కు సరిపోయాయో? లేదో? చూశారు. రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా పొలం గట్లపై పలు రకాల కూరగాయల సాగు అలాగే ఎర పంటలుగా బంతి, కంది సాగు చేసుకొని అదనపు ఆదాయాన్ని పొందాలన్నారు.

బస్ పాస్‌లు ఇవ్వరూ...

బూర్జ: ఆర్‌టిసి అధికారులు బస్సు పాస్‌లు మంజూరు చేయాలని మండలంలోని విద్యార్థులు కోరుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై పది రోజులు అవుతున్నా అధికారులు ఇప్పటికీ బస్సు పాస్‌లు ఇవ్వలేదని వాపోయారు. శ్రీకాకుళం, పాలకొండ, ఆమదాలవలస పట్టణాల్లో ఉన్న కళాశాలలకు వందలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బస్సు పాస్‌లు ఇవ్వకపోవడంతో రోజూ రూ.వందలు ఖర్చు అవుతుందని అన్నారు. అలాగే స్టూడెంట్స్ స్పెషల్ బస్సులను నడపాలని కోరుతున్నారు.

వాటర్ ట్యాంకు పనులు పరిశీలన

జి.సిగడాం : మండలంలోని మద్రివలస పంచాయతీ మానంపేటలో తాగునీటి ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులను ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ బగాది భాగ్యలక్ష్మి మంగళవారం పరిశీలించారు. గ్రామస్తులకు తాగునీటి సరఫరాకు తయారవుతున్న ట్యాంకు పనుల నాణ్యతను అధికారుల సమక్షంలో సమీక్షించారు. తాగునీటి నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ విక్రం కోటిబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కృష్ణ, పి.కిషోర్ పాల్గొన్నారు.

సకాలంలో హాజరు కావాలి

పలాస : పారిశుధ్య పనులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ కార్మికులకు హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు సక్రమంగా హాజరు కావాలన్నారు. పూర్తి స్థాయిలో పారిశుధ్య కార్మికులు హాజరయ్యేవిధంగా చూడాలన్నారు.

పౌష్టికాహార పంపిణీలో రాజీ వద్దు

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థీ మానసిక, శారీరక ఎదుగుదలకు పౌష్టికాహారం అవసరమని, దీనిని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జగనన్న గోరుముద్ద పథకంలో చేసిన మార్పులని, ఉపాధ్యాయులు విద్యార్థులకు అందించే క్రమంలో అలసత్వం ప్రదర్శించ వద్దని ఉప విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ అన్నారు. మండలంలోని నర్సింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రాగిజావ పంపిణీని మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో మాట్లాడి రుచికరంగా ఆహార పదార్థాలను వండడంలో మెళకువలు నేర్చుకోవాలన్నారు. అనంతరం జగనన్న కిట్లు పంపిణీ ఏ మేరకు చేపట్టారు, పాఠశాలలో విద్యార్థుల చేరికపై ప్రధానోపాధ్యాయులు సోమేశ్వరరావుని అడిగి తెలుసుకున్నారు. ఈమెతో పాటు ఎంఇఒ దాసరి నాగభూషణం, పాఠశాల ఉపాధ్యాయులు ఇసంపల్లి చిన్నవాడు, బడగల ప్రమీళ, పాపారావు, పాలవలస ధర్మారావు, విజయ్‌కుమార్, మల్లీశ్వరి, హైమావతి పాల్గొన్నారు.


విద్యార్థిని సామర్థ్యాన్ని తెలుసుకుంటున్న పగడాలమ్మ

జెవికె కిట్లు పంపిణీ

మెళియాపుట్టి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న జగనన్న కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఉప విద్యాశాఖాధికారి పగడాలమ్మ అన్నారు. మెళియాపుట్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ ఏడాది పాఠశాలలో ప్రవేశాలపై ప్రధానోపాధ్యాయులు యు.గణపతిరావుని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగనన్న కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ సవర దేవేంద్రరావు, మల్లారెడ్డి పద్మనాభరావు పాల్గొన్నారు.

ఇన్నాళ్లూ లేని అభ్యంతరం ఇప్పుడెందుకో?

ప్రజాశక్తి- మందస

మండలంలో బాలిగాం తెలుగుదేశం పార్టీ జెండా దిమ్మ నాలుగు దశాబ్దాలుగా అక్కడే ఉందని, ఇన్నాళ్లూ లేని అభ్యంతం ఎప్పుడు ఎందుకొచ్చిందని టిడిపి మండల అధ్యక్షుడు బావన దుర్యోధన ప్రశ్నించారు. మండలంలోని హరిపురం టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బాలిగాంలో టిడిపి జెండా దిమ్మను కొంతమంది శనివారం అర్ధరాత్రి సమయంలో ధ్వంసం చేయగా, దాన్ని పునర్నిర్మించేందుకు మాజీ మంత్రి అక్కడకు చేరుకున్నారని అన్నారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం లేకుండా ఉన్న సమయంలో ఇన్‌ఛార్జి డిఎస్‌పి భరత్ చంద్ర రెడ్డి అక్కడకు చేరుకుని భయానక వాతావరణం సృష్టించారని ఆరోపించారు. ఒక వ్యక్తికో, ఒక పార్టీకో కొమ్ము కాయడం సరికాదన్నారు. రోడ్డుకు అడ్డంగా ఉందనుకుంటే అక్కడికి నాలుగు మీటర్ల దూరంలో వైసిపి జెండా దిమ్మ కూడా ఉందని గుర్తు చేశారు. తమ పార్టీకి చెందిన జెండాను పునరుద్ధరణ చేశాక మళ్లీ పోలీసులు ప్రొక్లెయినర్‌తో తొలగించడాన్ని తప్పుబట్టారు. సాగునీటి కాలువలు, చెరువుల్లో పూడికలు పేరుకుపోతున్న మంత్రి సీదిరి అప్పలరాజు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి నాయకులు దాసరి తాతారావు, బమ్మిడి కర్రయ్య, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, ముడుముంచి నవీన్‌కుమార్, తమ్మినేని ధనుంజయ, జి.కె.నాయుడు, బైరిశెట్టి గున్నయ్య, పుల్లా వాసు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దుర్యోధన

వైభవంగా జగన్నాథస్వామి రథయాత్ర


పలాస : రథయాత్రకు తరలివచ్చిన యాత్రికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఒడిశాలోని పూరి తరహాలో శ్రీకాకుళంలోని జగన్నాథస్వామి రథయాత్రను మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆషాఢ మాసం శుక్ల పక్షం రెండో రోజున ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నగరంలోని బొందిలీపురం, గుజరాతీపేటల్లో ఆలయ ఉత్సవ విగ్రహాలు ఊరేగించారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఈ ఉత్సవాల్లో పాల్గొని ఆటాపాటల నడుమ రథాన్ని ముందుకు కదిలించారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో జగన్నాథస్వామి రథయాత్ర కనుల పండుగా సాగింది. స్థానిక జగన్నాథ స్వామి ఆలయం వీధిలోని ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జగన్నాథ, సుభద్ర, బలభద్ర విగ్రహాలను రథంపై ఎక్కించి యాత్రికులు ఊరేగించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయా, వైసిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ఆలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, దువ్వు వివేకానంద, పిలక దేవరాజు, ప్రకాశరావు పట్నాయక్, కారంగి మోహనరావు, చాట్ల లోహిదాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పరిధిలోని కాశీబుగ్గ రామాలయం, మండలంలోని బ్రాహ్మణతర్ల, తర్లకోట, రెంటికోట గ్రామాల్లో జగన్నాథ స్వామి రథయాత్ర ఘనంగా ప్రారంభమైంది. జగన్నాథ స్వామి ఆలయాల నుంచి గండిచా వరకు జగన్నాథ స్వామి బలబద్రుడు సుభద్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ రథయాత్రకు చుట్టుపక్క ప్రాంతాల నుంచి యాత్రికులు తరలివచ్చారు.

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురంలో జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు సాగింది. రథాన్ని అన్ని విధుల్లో ఊరేగించారు.


మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత

ప్రజాశక్తి- సోంపేట

జిల్లాలోనే ప్రథమంగా అవయవదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచిన సోంపేటకు చెందిన మల్లారెడ్డి కిరణ్ చంద్ జ్ఞాపకార్థం మంగళవారం నాలుగు మండలాల పదో తరగతికి చెందిన విద్యార్థులకు సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి రూ.5 వేలు నగదుతో స్కాలర్‌షిప్ మంగళవారం అందజేశారు. కిరణ్ చంద్ చదువుకున్న రవీంద్ర భారతి పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిరణ్ చంద్ తల్లిదండ్రులు మోహన్లను సత్కరించి వారి చేతులమీదుగా ఎంపిక చేసిన పది మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కిరణ్ చంద్ చేసిన త్యాగం అందరికీ ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు, తడక జోగారావు, నగిరి శరత్, మల్ల వెంకటరమణ, హెచ్‌ఎం సింహాచలం, బి జగన్, అజయ్, గిరిబాబు తత్తలు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు పరామర్శ

కవిటి: సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో శ్రీరాంపురం సర్పంచ్ సుమన్ గాయపడి ప్రస్తుతం సోంపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సీడాప్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి మంగళవారం పరామర్శించారు. సుమన్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని ఘర్షణకు గల కారణాలు అడిగితెలుసుకున్నారు. వీరితో పాటు సోంపేట జెడ్‌పిటిసి ప్రతినిధి తడక జోగారావు, గిరిబాబు ఉన్నారు.

భూ రీ సర్వే ప్రారంభం

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి పంచాయతీలో సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి జగనన్న భూ సమగ్ర రీ సర్వే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర భూ రీ సర్వే తో ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. అనంతరం డ్రోన్ ఎగరవేశారు. కార్యక్రమంలో సచివాలయ సర్వేర్లు శిరీష, భీమేష్, అనిత, రవి కళింగపట్నం అప్పారావు పాల్గొన్నారు.

అరసవల్లి భూముల వేలం ఖరారు

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి చెందిన వ్యవసాయ భూములను మూడేళ్ల పాటు సాగు చేసుకునేందుకు లీజు హక్కులను కల్పిస్తూ మంగళవారం వేలాన్ని ఖరారు చేశారు. ఇఒ విహారి సూర్యప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ వేలం ఖరారు చేశారు. 2023-26 వరకు మూడేళ్లు కౌలు హక్కును కల్పించారు. వేలంపాటలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, శ్రీకాకుళం దేవదాయ, ధర్మదాయ శాఖ కార్యాలయం ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు : రైలు ప్రమాదంలో తన రెండు కాళ్లు పోగొట్టుకున్న బాధితుడుకు చేయూత సంస్థ అండగా నిలిచింది. బాధితుడు ఈశ్వరరావును చేయూత సంస్థ సభ్యులు సోంపేటలోని చిన్న పల్లి వీధిలో అతని స్వగృహంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. నెల్లూరులో బతుకు తెరువు కోసం పని చేస్తుండేవాడునని, సెలవు నిమిత్తం తన స్వగ్రామానికి వస్తున్న సమయంలో తాగునీటి కోసం రైలు దిగి, మళ్లీ ఎక్కుతున్న సమయంలో జారిపడి తన కాళ్లను కోల్పోయనని బాధితుడు తెలిపారు. ఇంటి బరువు, బాధ్యతలు అన్ని తానే చూసుకునే వాడిని తెలిపారు. అతని పరిస్థితిని చూసి యువతరం సేవా సమితి రూ.20 వేలు చెక్‌ను అందజేశారు. అధ్యక్షులు చింత మురళి, నిహల్, గన్ను వెంకట రమణ, అన్నెపు లక్ష్మణ్‌రావు, కర్ని రేవతి, జ్యోతి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

నరసన్నపేట: లివర్ వ్యాధితో బాధపడుతున్న విద్యార్థికి మారుపు విజయ్ కుమార్ తన స్నేహితులతో కలిసి రూ.1.85 లక్షలు ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరసన్నపేట పట్టణంలో కొత్తవీధికి చెందిన కొండక ఆదినారాయణ వృత్తి రీత్యా ఫొటోగ్రఫీ చేస్తూ చల్లవానిపేటలో నివాసం ఉంటున్నారని అన్నారు. అయితే ఆదినారాయణ చిన్న కుమారుడు జ్వరం వచ్చి ఎప్పటికీ తగ్గకపోవడంతో వైద్య పరీక్షలు చేయుంచగా లివర్ వ్యాధి అని, దానికి రాయవెల్లూరులో ఆపరేషన్ చేయించాలని, వాటికి రూ.లక్షలు ఖర్చు అవుతుంది అని వైద్యులు తెలిపారని అన్నారు. వెంటనే అబ్బాయి తండ్రి తన స్నేహితుడు విజయ్ కుమార్‌కి తెలియచేశారని అనానరు. అతను మరికొంత మంది స్నేహితులు కలిసి రూ.1,85,000 ఆర్థికసాయం అందజేశామన్నారు.


వజ్రపుకొత్తూరు : చెక్కును అందజేస్తున్న సభ్యులు

ఉద్యోగోన్నతులపై హర్షం

ఇచ్ఛాపురం : ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీలు మునుపెన్నడూ లేని విధంగా ప్రభుత్వం సకాలంలో పూర్తి చేయడం అభినందనీయమని ఎపి ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. విద్యాశాఖలో 1998 నుంచి ఉమ్మడి సర్వీస్ రూల్స్ వివాదంతో నిలిచిపోయిందన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా చొరవ తీసుకుని కొత్తగా 679 ఎంఇఒ-2 పోస్టులను మంజూరు చేశారని అన్నారు. జిల్లా పరిషత్ హెచ్‌ఎంలను ఎంఇఒ-2 గెజిటెడ్ హోదాలో నియమించడంతో జెడ్‌పి టీచర్లకు ఎంతో ప్రయోజనం కలిగిందన్నారు. ఇదే సందర్భంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న 355 ఎంఇఒ-1 పోస్టులను ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎంలతో భర్తీ చేస్తామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం నిర్వహించిన ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో ఎంఇఒ-1 పోస్టుల భర్తీకి వెంటనే కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటించి ఈ నెల 25 లోపు పూర్తి చేసినట్లయితే బాగుంటుందన్నారు.

విద్యార్థులకు 'ఆణిముత్యాలు' పురస్కారం

జలుమూరు: మండలంలోని చల్లవానిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలుగా ఎంపికైన ముగ్గురు విద్యార్థులకు ఎంపిపి వాన గోపి చేతుల మీదుగా నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో చల్లవానిపేట పిఎసిఎస్ చైర్మన్ పాగోటి రాజప్పలనాయుడు, ఎంపిటిసి ప్రతినిధి పి.విజయకుమార్, వైస్‌సర్పంచ్ ప్రతినిధి చిన్నాల మురళి, వార్డు మెంబర్ దుంగ రమణ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాలను చూపిస్తున్న విద్యార్థినులు

చెత్త బుట్టల పంపిణీ


చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- రణస్థలం

మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి అధ్యక్షతన జగనన్న స్వచ్ఛ సంకల్పం చెత్త బుట్టలను ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం మంగళశారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లీన్ ఆంధ్రప్రదేశ్‌గా జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఏకైక సిఎం జగన్ అని అన్నారు. చెత్త బుట్టలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ఎఒ ధనుంజయరావు, మండల విస్తరణ అధికారి ఎ.ప్రభాకరరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు రెడ్డి విశ్వేశరరావు, మండల ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు మహంతి చినరామునాయుడు, కొండములగాం సర్పంచ్ గొర్లె అప్పలనాయుడు, దేవరాపల్లి సర్పంచ్ మీసాల శ్రీనివాసరావు, కోటపాలెం, రణస్థలం మోడల్ స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ టేకి బ్రహ్మాజీ, రణస్థలం సచివాలయం కన్వీనర్ మహంతి గురునాయుడు పాల్గొన్నారు.